రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 : నేడు హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో జరిగే గౌండ్ టేబుల్ సమావేవాన్ని జయ ప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రంగారెడ్డి జిల్లా బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు కేతరాజు నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో జరుగబోయే జనాభా లెక్కలతో పాటు కుల జనగణన కూడా చేయాలన్నారు. దమాషా ప్రకారం చట్టసభల్లో, విద్యా, వైద్యం, ఉపాధి రంగాల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలనే విషయాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. బీసీల హక్కులు, రిజర్వేషన్లకు మద్దతుగా జరుగుతున్న ఈ సమావేశాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనలో 3.1శాతం ప్రజలు పాల్గొనలేదని, ఈనెల 16 నుంచి 28 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. సమావేశంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ సురేశ్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, ఇతర సంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సహాయకార్యదర్శి కుమారస్వామి, నాయకులు కృష్ణ, శ్రీనివాస్‌సాగర్, శేఖర్, లక్ష్మీ, రామకృష్ణ, లక్ష్మి, చెంచయ్య, తిరుపతయ్య, సాయిలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి సారు..

ప్రమాదకరంగా నల్లచెరువు పెద్దవాగు రోడ్డు వంతెనను నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు

మాడ్గుల, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని నల్లచెరువు నుంచి అజిలాపూర్ వెళ్లే రోడ్డు బీటీ రోడ్డు ఉండగా, కానీ మధ్యలో పెద్దవాగు ఉండడంతో వర్షకాలంలో వర్షాలు వచ్చినప్పుడు వాగు నీటితో పారుతుంది. దీంతో నల్లచెరువు రైతులకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వాగు పైభాగంలో గ్రామానికి చెందిన రైతులకు ఎక్కువ మొత్తంలో వ్యవసాయ భూమి కలిగి ఉన్నారు. అజిలాపూర్ గ్రామ ప్రజలు మాడ్గుల తహసీల్దార్ కార్యాలయానికి రావాలంటే ఇదే రోడ్డు మీదుగా వస్తువుంటారు. పెద్దవాగుపై ఉన్న మట్టి కొట్టుకుపోయి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఇక్కడి రైతులు మండిపడుతున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సారు స్పందించి రోడ్డు బాగు చేయండి అంటూ వేడుకుంటున్నారు.

నిత్యం ప్రమాదాలే..

వర్షకాలంలో వర్షాలు వస్తే పెద్ద వాగు నీటితో పారుతుంది. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. వ్యవసాయం చేసుకునే రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- భూతరాజు మహేశ్, నల్లచెరువు గ్రామం

వంతెనను నిర్మించాలి

పెద్దవాగుపై వంతెన నిర్మిస్తే అజిలాపూర్, నల్లచెరువు, ఇర్విన్ గ్రామ ప్రజలకు పూర్తిగా సమస్య పరిష్కారం అవుతుంది. వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా ఉంటుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బ్రిడ్జి మంజూరు చేసి ఇక్కడి ప్రజల సమస్యను తీర్చాలని కోరుతున్న.

- పేట రాజు, నల్లచెరువు గ్రామం, మాడ్గుల మండలం

బండోనిగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, ఫిబ్రవరి 27 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలంలోని బుగ్గోనిగూడలో రూ.10లక్షలతో మహిళ సమైఖ్య భవనం, బండోనిగూడలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, చేగూరులో రూ.18లక్షలతో సీసీ రోడ్డు, డైనేజీ, వెంకమ్మగూడలో రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, మామిడిపల్లిలో రూ.24లక్షలతో సీసీ రోడ్డు, డైనేజీ పనులకు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, రాజ్‌గోపాల్, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, రాములమ్మ, నాయకులు నర్సింహ, శ్రీశైలం, నర్సింహ, బుచ్చయ్య, ఆంజనేయులు, సాలయ్య, శేఖర్‌గౌడ్, అన్వర్, నవీన్‌గౌడ్, రాజలింగంగౌడ్, సుదర్శన్, యాదగిరిరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న క్రీడాపోటీలు

షాబాద్, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడవ రోజు గురువారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మొయినాబాద్ జట్టుపై చేవెళ్ల జట్టు విజయం సాధించగా, షాబాద్ జట్టుపై శంకర్‌పల్లి జట్టు విజయం సాధించింది. శుక్రవారం ఉదయం 10గంటలకు చేవెళ్ల, శంకర్‌పల్లి జట్లకు ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 3గంటలకు వాలీబాల్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఉదయం 9గంటల లోపు వాలీబాల్ జట్ల వివరాలు 9949086569 కు తెలపాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, క్రీడల నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, మయూర్, రాము, నాయకులు శ్రీరాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాంమ్మోహన్‌గుప్తా, కృష్ణయ్య, సత్తయ్య, వెంకటయ్య, పరుశావేది, అంబారెడ్డి, సురేందర్, నవీన్, నర్సింహులు, రవి, రమేశ్ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

ఆదిబట్ల, ఫిబ్రవరి 27: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ వారు నిర్వహించే మెగా జాబ్ మేళాను నియోజకవర్గంలోని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1న మున్సిపాలిటీ పరిధిలోని నాగార్జునసాగర్ హైవే, బొంగుళూరు సమీపంలోని ప్రమిదా కన్వేన్షన్ హాల్‌లో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో 18కి పైగా కంపెనీలు 4000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

మొయినాబాద్, ఫిబ్రవరి27: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని మేడిపల్లి మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్‌కు కె వినయ్ టీం, జి మహేష్ జట్లు చేరుకుని హోరాహోరిగా తలపడగా వినయ్ టీం మొదటి బహుమతిని, మహేష్ టీం ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు అంజి, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

కమిషనర్ వద్ద ఆస్తి పన్నును చెల్లిస్తున్న ప్రజలు

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 27 : సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ప్రజలు నేరుగా పన్నులను చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లను సైతం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా డిజిటల్ క్రాప్ సర్వే

డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈవో రాజేశ్వరి

కేశంపేట, ఫిబ్రవరి 27: కేశంపేట మండలం ఇప్పలపల్లి క్లస్టర్ పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఇప్పలపల్లి ఏఈవో రాజేశ్వరి ఇప్పలపల్లి, దేవునిగుడితండా, తూర్పుగడ్డతండా, పాపిరెడ్డిగూడ, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, దత్తాయపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిజిటల్ క్రాప్ సర్వే చేయడం జరుగుతుందని, రైతులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

ప్రమాదం జరుగకముందే.. సవరించండి

గురుకుల పాఠశాల గోడకు ఉన్న బండలు ఊడుతున్న వైనం
మరమ్మత్తులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకోలు

చిలుకూరు గురుకుల పాఠశాలలో గోడకు పాఠశాల పేరుతో ఉన్న బండలు ఊడుతున్న దృశ్యం

మొయినాబాద్, ఫిబ్రవరి27: గురుకుల విద్యా సంస్థ అధికారులకు చాలా నిర్లక్ష్యం కనిపిస్తుంది. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గేట్ ఎదుట గోడకు మార్బుల్ అమర్చి దానికి పాఠశాల పేరు రాసారు. ఇది కింద పడిపోయే ప్రమాద స్థాయిలో కనిపిస్తున్నాయి. బండలు ఊడి ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించేలా లేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 27 : చేవెళ్ల మండల పరిధి తంగడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. గురువారం ఆలయ నిర్మాణ స్థల దాత మఠం శివానందం తన వంతు సహకారంగా రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల తరపున దాత మఠం శివానందంను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనూషసత్తయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, రాఘవరెడ్డి, అంతిరెడ్డి, చంద్రయ్యగౌడ్, రవీందర్, సుధాకర్‌గౌడ్, నారాయణ, ఎం.చంద్రయ్య, కిష్టయ్య, యాదయ్య గౌడ్, చిన్న సత్యయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కేశంపేట, ఫిబ్రవరి 27: మండలంలోని అల్వాల గ్రామంలో బండలాగుడు పోటీలను మాజీ జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి గురువారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని శివాలయం ఆవరణలో మహాశివరాత్రిని పురస్కరించుకొని బండలాగుడు పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రానికి చెందిన భైరమోని నర్సింహ(68) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న భరత్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రమణ గురువారం బాధిత కుటుంబానికి రమణగౌడ్ రూ.5వేల, మాజీ జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీరివెంట పాండుగౌడ్, ఆంజనేయులు, హరికిషన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గణేశ్, రామకృష్ణ, మల్లయ్య, వెంకటయ్య, వెంకటయ్య, అనంతగిరి, రవి, శ్రీణు, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేశంపేట, ఫిబ్రవరి 27: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని గురువారం కేసు నమోదు చేసినట్లు కేశంపేట పోలీసులు తెలిపారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. నిర్దవెల్లి గ్రామ శివారులోని వాగులో బుధవారం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా, సగం వరకు నింపిన ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యారని, దీంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఊరెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ కుంచము పెంటయ్య, కుమారులు శివకుమారు, శ్రావణ్‌కుమార్, నరేశ్, మనుమడు శరత్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు.

- చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 27

వసతులు కల్పించాలి

బండ్లగూడ విజ్ఞాన్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని కమిషనర్ శరత్‌చంద్ర కళాశాల యజమానులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రమైన విజ్ఞాన్ కళాశాలలో చైర్మన్ గౌరీ సతీష్‌తో కలిసి గురువారం కమిషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలో వసతుల ఏర్పాట్ల గురించి కళాశాల యజమానులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరీక్షా సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కళాశాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బండ్లగూడ, ఫిబ్రవరి 27.. పీ అండ్ టీ కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను పీఅండ్ టీ కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాత్రి వేళలో రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు జరుగుతున్నారన్నారు. వెంటనే తమ కాలనీలో విద్యుత్ దీపాలతో పాటు ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సాయంత్రం వేళలో దోమల బెడద తీవ్రంగా ఉందని దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు నదీమ్, అబ్దుల్ ఆఫీస్, ఎండీ షఫీ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండల పరిధిలోని జంగోనిగూడ పృథ్వి కాలనీలోని హనుమాన్ దేవాలయంలో గురువారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సుధాకర్, యాదయ్య, వెంకటేశ్, నాగేందర్, కనకయ్య, నరేశ్, పరమేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వంశీ పాల్గొన్నారు.

- నందిగామ, ఫిబ్రవరి27

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామంలోని అమృత పంచలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం బీఆర్ఎస్ నాయకుడు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కెప్టెన్ అంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

- చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 27

మహిళా భవనం మరమ్మతులకు నిధులు మంజూరు



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సాహెబ్‌నగర్ మహిళా మండలి సభ్యులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 27 : సాహెబ్‌నగర్‌లోని మహిళా సంక్షేమ భవనం అభివృద్ధికి రూ.12.80 లక్షల నిధులు మంజూరైనట్లు బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. గురువారం సంక్షేమ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ భవనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రధానంగా మహిళలకు అవి అవసరమన్నారు. వారి సమస్యలు చర్చించుకోవడంతోపాటు, వారి ఆర్థిక ఎదుగుదలకు సంక్షేమ భవనాలు దోహదం చేస్తాయన్నారు. త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మహిళలు కార్పొరేటర్‌కు అందజేశారు. మహిళా సంఘం సభ్యులు పద్మ, అర్చన, అరుణ, గౌతమి, లావణ్య, లక్ష్మమ్మ, అరుణ, పుష్ప, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా.. సాగు రంగానిదే..!

ప్రొఫెసర్లు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సనానిస్తున్న అధ్యాపకులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి, 27: రానున్న కాలంలో వ్యవసాయ ,అనుబంధ రంగాలకే తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన వీసీల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.తెలంగాణ వ్యవసాయ,అనుబంధ రంగాలైన పశుపోషణ,పంటలు,కూరగాయల పెంపకంలో దేశ వ్యాప్తంగా మంచిపేరు వస్తుందన్నారు. సమష్టిగా పనిచేసి మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రధానంగా ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.అల్ధా స్ జానయ్య, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతిగా రాజిరెడ్డి, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకుపతిగా డా.జ్ఞాన ప్రకాశ్ లను నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఆయా రంగాల అభివృద్ధికి మరింత కృషిచేయాలని ఆయన సూచించారు.అనంతరం వారిని ఉద్యోగులు ,విద్యార్థుల సమక్షంలో సన్మానించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్, శరత్ చంద్ర, డా.భగవాన్,డీన్ నరేందర్ రెడ్డి,ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.